మంగళవారం 25 జూన్ 2024 5 విజయనగరం



27న జాబ్‌మేళా

ప్రజాశక్తి–విజయనగరం కోట

పలు ప్రయివేటు కంపెనీల్లో 310 ఉద్యోగాల భర్తీకి ఈనెల 27న ఎంఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్ (150), ముత్తూట్ ఫైనాన్స్‌లో రిలేషన్ షిప్ ఆఫీసర్(100), జాబ్ డీలర్స్ కంపెనీలో ఫ్రంట్ ఆఫీసు, టెలీ కాలింగ్, హెల్పర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, డ్రైవర్స్ (60) ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో పోస్టును బట్టి పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకి, సంబంధిత సర్టిఫికేట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 8919179415 నంబరుకు సంప్రదించాలని సూచించారు.



మైనింగ్ దోపిడీ

జిల్లాలోని మైనింగ్ క్వారీలను ప్రజా ప్రాజెక్టుల పేరుతో కొంతమంది బడా వ్యాపారులు కొల్లగొడుతున్నారు. కాసుల కక్కుర్తిలో అధికారులు కూడా ప్రభుత్వ పాలసీలను పక్కదోవ పట్టించి, కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయాన్ని దోపిడీ చేస్తున్న కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారు. గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగిన మైనింగ్ లూటీ, కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతూనే ఉంది. జామి మండల కేంద్రంలో క్వారీల పని తీరును పరిశీలిస్తే కార్పొరేట్ల మైనింగ్ మాఫియా ఎలా ఉందో అర్థమవుతోంది.

- కార్పొరేట్లకు పట్టని ప్రభుత్వ నిబంధనలు
- స్థానికుల ఉపాధికి భారీ గండి
- ప్రభుత్వాలు మారినా పట్టించు కోని అధికారులు

ప్రజాశక్తి – జామి

జిల్లాలో 200కు పైగా రోడ్డు మెటల్ క్వారీలు, వంద వరకూ గ్రావెల్ క్వారీలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా క్వారీలు రెన్యువల్ జరగక, పూర్తి స్థాయి ప్రభుత్వ అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. ప్రధానంగా పర్యావరణ క్లియరెన్స్ (ఇసి)లు లేక క్వారీలు, వాటిపై ఆధారపడిన స్టోన్ క్రషర్లు మూతబడ్డాయి. దీంతో వీటిపై ఆధార పడిన వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. కానీ కోట్ల రూపాయల కాంట్రాక్టు దక్కించుకున్న కార్పొరేట్లకు మాత్రం గత ప్రభుత్వంలో కారు చౌకగా దక్కాయి. సామాన్యుడు కొనలేని స్థితిలోకి మెటల్ ధరలు వెళ్ళిపోయిన పరిస్థితుల్లో సొంతింటి కల మసకబారుతోంది.

జామి మండలంలో క్వారీలు ఒకటి, రెండు మినహా దాదాపుగా అన్ని క్వారీలు ఇసి (ఎన్విరాల్ మెంట్ క్లియరెన్స్)లు లేక నిలిచిపోయాయి. దీంతో క్వారీల్లో పనులు చేయడానికి అవకాశం లేక, లీజు దారులు క్వారీలు నిలిపేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీని ప్రైవేటుకు అప్పగించడంతో క్వారీ మైనింగ్ కుదరని పని. ఈ నేపథ్యంలో దాదాపుగా క్వారీలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే పలు ప్రాజెక్టులు దక్కించుకున్న కార్పొరేట్లు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రాత్రి, పగలు అన్న తేడా లేకుండా మైనింగ్ చేస్తున్నాఉ. జామి, కొత్తవలస, గంట్యాడ మండలాల్లో నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి కాంట్రాక్టర్ జామి, ఆలుగుబిల్లి క్వారీలను అడ్డగోలుగా దక్కించుకున్నాయి. ఇప్పటికే లక్షల టన్నులు మైనింగ్ చేస్తున్నారు. క్వారీలకు ఇసిలు, పర్మిట్‌లు అవసరం లేకుండా అధికార యంత్రాంగానికి కొంత ముట్టజెప్పి అడ్డగోలుగా క్వారీల్లో మైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్కడితో ఆగకుండా తమ ప్రాజెక్టులకు కావాల్సిన మెటీరియల్‌ను మైనింగ్ చేసుకుని మిగిలిన క్వారీలను మరో ప్రాజెక్టు కాంట్రాక్టర్‌కు అప్పగించి వ్యాపారం చేసుకుంటున్నారు. ఒక్క జామి, ఆలుగుబిల్లి క్వారీలు మాత్రమే కాదు. జిల్లాలోని అన్ని క్వారీలు ప్రస్తుతం కార్పొరేట్ల చేతుల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. ఓల్టా చట్టాలను అతిక్రమించి, నాల్గు, ఐదు వందల అడుగులకు పైగా మైనింగ్ చేయడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో 5 కిలో మీటర్ల పైన భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

ఉపాధి అవకాశాలకు గండి

జిల్లాలో క్వారీలపై సుమారుగా 10 వేల మంది వరకు కార్మికులు ఆధారపడి బతుకుతున్నారు. నేడు పెద్దపెద్ద మిషనరీ రావడంతో ఆ సంఖ్య సగానికిపైగా పడిపోయింది. అయితే కార్పొరేట్లు ఒడిశా, జార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించుకొని స్థానికుల ఉపాధికి ఎసరు పెడుతున్నారు. పైగా పదేళ్ల పాటు కార్మికులు పని చేయాల్సిన క్వారీలను అడ్డగోలుగా తవ్వి, గ్రామాలకు గ్రామాలు వలసలు పోయే ప్రాంతాలుగా మార్చేస్తున్నారు.

వివాదాస్పదంగా వైసిపి కార్యాలయం

అనుమతులు లేకుండా నిర్మాణం ● పనులు నిలపివేయాలంటూ టౌన్ ప్లానింగ్ విభాగం నోటీస్

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి / టౌన్

నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయం వివాదా స్పదంగా మారింది. అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణ పనులను తక్షణమే ఆపేయాలంటూ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం సోమవారం నోటీసు జారీచేసింది. దీంతో, ఈ వివాదం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కొన్ని జిల్లాల్లో నిర్మాణ అనుమతులు తీసుకోకుండా, మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూముల్లోనూ వైసిపి కార్యాలయ భవన నిర్మాణాలు చేపట్టినట్టు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రభుత్వం ఏకంగా కూల్చివేసింది. ఈనేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని జమ్మునారాయణపురం రెవెన్యూ పరిధిలో రింగురోడ్డుకు ఆనుకుని చేపట్టిన కార్యాలయ నిర్మాణ పనులకు విఎంఆర్‌డిఎ నుంచి అనుమతులు పొందలేదని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తేల్చారు. అలాగే అగ్నిమాపక శాఖ నుంచి కూడా అనుమతులు పొందలేదని కూడా అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు వైసిపి జిల్లా అధ్యక్షునికి నోటీసులు జారీచేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. మరోవైపు కార్యాలయ భవన స్థలం కూడా మాన్సాస్‌కు చెందినదని, అధికారాన్ని అడ్డంపెట్టుకుని, అధికారులపై ఒత్తిడి చేసి నిర్మాణాలు చేపట్టారంటూ టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. వైసిపి నాయకులు మాత్రం భవన నిర్మాణాల విషయంలో అన్నీ చట్టబద్ధంగానే ఉన్నాయని, ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా తమ పార్టీని బదనం చేయడానికి ప్రయత్నిస్తోందని అంటున్నారు.

విజయనగరంలో నిర్మాణంలో ఉన్న వైసిపి కార్యాలయం



డిగ్రీ కళాశాలకు ఉపయోగించాలి

ఈ వ్యవహారం చర్చనీయాశం కావడంతో ఈ భవన నిర్మాణాన్ని కూల్చేకన్నా ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు ఉపయోగిస్తే బాగుటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ సొంత భవనం లేదు. ప్రస్తుతం ప్రభుత్వ సాంస్కృత కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. వసతులు సరిపోకపోవడంతో అక్కడ విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర అసవస్థలు పడుతున్నారు. ఇక లైబ్రరీ, ప్రయోగశాలలు కూడా లేకపోవడంతో విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాలు తగ్గుతున్నాయి.



సమస్యలు వింటున్న ఎస్‌పి ఎం.దీపిక

సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి–విజయనగరం కోట

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్‌పి ఎం. దీపిక సోమవారం నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా 39 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం

అడ్డుకునేందుకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై అక్రమ కేసులు

ప్రజాశక్తి–బొబ్బిలి



ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం పుస్తకాలు అమ్మడం నేరం. విద్యాహక్కు చట్ట ప్రకారం పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉన్నప్పటికీ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలోని సురేష్ స్కూల్ యాజమాన్యం స్కూల్ పేరిట ఒక ఇల్లు అద్దెకు తీసుకుని పుస్తకాలు అమ్ముతోంది. రెండు రోజుల క్రితం ఎపి విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఆందోళన చేయగా డిప్యూటీ డిఇఒ కార్యాలయ అధికారి వెళ్లి పుస్తకాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన పుస్తకాలను యాజమాన్యం మళ్లీ అమ్మడంతో తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షులు మణికుమార్, మరో నలుగురు సభ్యులు పుస్తకాల అమ్మకాలను అడ్డుకునేందుకు సోమవారం వెళ్లగా నాయకులపై స్కూలు యాజమాన్యం ప్రతినిధులు పోలీసులకు అక్రమ కేసు పెట్టడంతో పోలీసులు ఎస్.ఎఫ్.ఐ నాయకులను అదుపులోకి తీసుకుని విడిచిపెట్టారు. పుస్తకాలు అమ్ముతున్న ఇంటి వద్ద మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు ఉన్నప్పటికీ ఏమి సంబంధం లేనట్లు వ్యవహరించారని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాల దోపిడీని అడ్డుకుంటే అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కేసులను ఎత్తి వేసి నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సురేష్ స్కూల్ యాజమాన్యం, విద్యాశాఖ అధికారులు తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పి.రామ్మోహన్ తెలిపారు.

అతిసార నియంత్రణకు టాస్క్ ఫోర్స్

- పది శాఖల సమన్వయంతో అతిసార కట్టడికి కార్యక్రమాలు
- ఐదేళ్లలోపు పిల్లల్లో మరణాలను నివారించడమే లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



ప్రజాశక్తి–విజయనగరం కోట

జిల్లాలో అతిసార వ్యాధి వ్యాప్తిని నిరోధించేందుకు పది ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ చెప్పారు. జూలై 1 నుంచి ఆగష్టు 31 వరకు రెండు నెలల పాటు ఈ వ్యాధిని నియంత్రించేందుకు టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. జిల్లా స్థాయి అతిసార నియంత్రణ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లలు ఎవ్వరూ ఈ వ్యాధి బారిన పడి మరణించకుండా ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ప్యాకెట్లు పంపిణీ, తాగునీటి వనరులు కలుషితం కాకుండా వాటిని తరచుగా క్లోరినేషన్ చేయించడం, స్కూల్ పిల్లల్లో భోజనానికి ముందు చేతులు శుభ్రపరచుకొనేలా చర్యలు చేపట్టడం, పరిసరాల పరిశుభ్రత చర్యలు చేపట్టడం వంటి చర్యల ద్వారా వచ్చే రెండు నెలల కాలంలో జిల్లాలో అతిసార మరణాలు సంభవించకుండా అప్రమత్తంగా వుండాలని జెసి ఆదేశించారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ రెండు నెలలు పాటు జరిగే స్టాప్ డయేరియా కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళాశిశు సంక్షేమశాఖ, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్, విద్యాశాఖ, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ, ప్రజారోగ్య ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధిశాఖ, ఆహారం, పౌరసరఫరాలు, పట్టణాభివృద్ధి తదితర శాఖలు భాగస్వామ్యం అవుతున్నట్టు చెప్పారు. జిల్లాలో 1.34 లక్షల మంది ఐదేళ్ల లోపు వయసు గల చిన్నారులు వున్నట్టు చెప్పారు. ముఖ్యంగా మురికివాడలు, గిరిజన ప్రాంతాలు, మత్స్య కార నివాస గ్రామాల్లో యీ వ్యాధి ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ రోపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్‌లు మురళీ కృష్ణ, నూకరాజు, రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




సైకిల్‌పై పార్లమెంట్‌కు పయనమైన ఎంపిని అభినందిస్తున్నకేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

సైకిల్‌పై పార్లమెంట్‌కు కలిశెట్టి

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు భారత పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లారు. దేశరాజధాని ఢిల్లీలో సోమవారం చోటు చేసుకున్న ఈ సన్నివేశ దృశ్యాలు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన అప్పలనాయుడు తొలి నుంచీ అత్యంత నిడారంబరంగానే ఉంటారు. పార్టీ పట్ల ఎంతో విధేయతతో ఉండడంతో చాలా మంది సీనియర్లను పక్కనబెట్టి మరీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు విజయనగరం ఎంపీగా పోటీచేసేందుకు అవకాశం కల్పించారు. 'పేదవాడిని పార్లమెంటుకు పంపండి' అంటూ అప్పలనాయుడు తరపున చంద్రబాబు ప్రచారం కూడా చేశారు. అంతా అనుకూలించడంతో అప్పలనాయుడు 2,49,351 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈనేపథ్యంలో ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన ఆయన తాను బసచేసిన అతిథి గృహం నుంచి పార్లమెంట్ వరకు సైకిల్‌పై వెళ్లారు. తెలుగుదనం ఉట్టుపడేలా చిలకట్టు వస్త్రధారణ పార్లమెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంపిగా ప్రమాణ స్వీకారం కూడా తెలుగులోనే చేశారు. అప్పలనాయుడు ఇప్పటికీ రణస్థలం మండల కేంద్రంలోని పాత ఇంటిలోనే సాధారణ జీవితం గడుపుతున్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారంలో తొలుత కలిశెట్టి అప్పలనాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.





ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయనగరం,అరకు ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, తనూజారాణి



కలెక్టర్‌ను అభినందిస్తున్న పౌరసంబంధాలశాఖ అధికారి రమేష్ తదితరులు

కలెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి–విజయనగరం కోట

బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అభినందనలు తెలిపింది. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి డి.రమేష్ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ఫోటోలతో కూడిన చిత్ర మాలికను జ్ఞాపికగా బహూకరించారు. తమ శాఖకు కలెక్టర్ అన్ని విధాలా సహాయ సహకారాలను అందించారని, కొత్త కార్యాలయ భవనాలను సైతం కేటాయించారని డిపిఆర్‌ఒ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పిఆర్‌ఒ ఎస్.జానకమ్మ, జెఆర్‌ఒ మల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి శ్రీనివాస్ రాక

ప్రజాశక్తి–విజయనగరం కోట

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం రానున్నారు. ఉదయం 10గంటలనుంచి జెడ్‌పి గెస్టహౌస్‌లో అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4గంటల నుంచి గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు,నాయకులకు అందుబాటులో ఉంటారు.

కలెక్టరేట్ పరిపాలన విభాగాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి– విజయనగరం కోట

కలెక్టరేట్ ప్రాంగణంలో ఆధునీకరించిన పరిపాలనా విభాగాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ విభాగాన్ని అధికారులు, సిబ్బందికి సౌకర్యకరంగా ఉండేవిధంగా తీర్చిదిద్దారు. కొత్తగా ఎసి సౌకర్యం కల్పించడంతో బాటు, ఫ్లోరింగ్, సీలింగ్, వ్యక్తిగత కేబిన్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఎఒ ఎ.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి–విజయనగరంటౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, డిఇఒలు, వర్క్ ఇన్‌స్పెక్టర్, ప్లాంటేషన్, రెవెన్యూ, అటెండర్‌లు, పార్కుల్లో, ఆఫీస్‌లో పనిచేసే సిబ్బందికి అర్హత, సినియార్టీ ప్రకారం స్కిల్, సెమీ స్కిల్, అన్ స్కిల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్ చెల్లించాలని కోరుతూ సోమవారం జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యునియన్ నాయకులు వినతినిచ్చారు. సంక్రాంతి కానుక వెయ్యిరూపాయలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. గత ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్ 75 వేల తో పాటు 10 సంవత్సరాల సర్వీస్ పైబడిన వారికి సంవత్సరానికి రూ.2వేలు చొప్పున అదనంగా చెల్లించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల ఖాళీ ల్లో అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. విజయనగరం నగర పాలక సంస్థలో థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలని, పంపు హౌస్ కార్మికులకు మెన్, మెటీరియల్ వేరు చేయాలని, బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. వినతిచ్చిన వారిలో యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు తదితరులు ఉన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతినిస్తున్న సిఐటియు నాయకులు

గ్రీవెన్సుకు 192 వినతులు

విజయనగరంకోట : కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 192 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ సూర్యకళ , డిప్యూటీ కలెక్టర్లు మురళీ కృష్ణ, రాజేశ్వరి, నూకరాజు తదితరులు వినతులు స్వీకరించారు. రెవిన్యూ శాఖ సమస్యలపై 135, డిఆర్‌డిఎకు సంబంధించి 29, జిల్లా పంచాయతీ శాఖకు 9, విద్యా శాఖకు 9, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 8, మున్సిపల్ శాఖకు 2 చొప్పున వినతులు అందాయి.

కమిషర్ వినతులు స్వీకరణ

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు 5 వినతులు వచ్చాయి. వినతులు స్వీకరించిన కమిషనర్ ఎంఎం నాయుడుకు వాటి పరిష్కారానికి సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. హౌసింగ్ సంబంధించి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, శానిటేషన్‌కు సంబంధించి రెండు, వాలంటీర్ల రాజీనామా సంబంధించి రెండు వినతులు అందాయి. 41 డివిజన్ 49 వ నెంబర్ సచివాలయ పరిధిలో అనధికార సభ్యులు సచివాలయంలోకి ప్రవేశించి సిబ్బందితో సమీక్ష చేయడం విరుద్ధమంటూ విచారణ జరిపించాలని బొంగ భానుమూర్తి వినతి అందజేశారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీ రావు, ఇఇ కె.శ్రీనివాసరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ అధ్యక్షులుగా అచ్చిరెడ్డి

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ విజయనగరం జిల్లా అధ్యక్షులుగా విజయనగరానికి చెందిన ఎస్.అచ్చి రెడ్డి ఎంపికయ్యారు. సోమవారం విశాఖపట్నం ఐహెచ్‌ఆర్‌సి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో అచ్చిరెడ్డిని ఘనంగా సత్కరించారు. గతంలో హెచ్‌ఆర్‌సి సభ్యుడిగా ఆయన చేసిన సేవలను గుర్తించి నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు గుర్తింపు కార్డును, నియమక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రెటరీ పిఐఎస్ రాజు, ఎపి తెలంగాణ స్పోర్ట్స్ అడ్వైజర్ పి. మురళి, రాష్ట్ర అధ్యక్షులు వై.శ్రీనివాస్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ విజయనగరం జిల్లా జనరల్ సెక్రటరీ వై.కిషోర్ ఎస్.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలి


ప్రజాశక్తి–విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు


ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, దుక్కుల తదితర అవసరాల కోసం ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సోమవారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే స్పందించి సాయమంది ంచాలని కోరారు. తాటిపూడి ప్రాజెక్ట్ కాలువలు పూడిక, డామ్ వద్ద షట్టర్లు పాడవటం వల్ల పొలాలకు నీరు సక్రమంగా వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి పంపిణీ సిబ్బంది, లష్కర్లు లేకపోవటం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లక రైతులు ఏటా పంటలు నష్టపోతున్నారన్నారు. మధుపాడ నుండి రామబద్రపురం డివిజన్ డామ్ వరకు కాలువ జంగిల్, పూడిక తొలగించాలన్నారు. బోనంగి సేరి కాలువ వద్ద ముటా కాలువకు గండి పడటం వల్ల ఆ కాలువ దిగువన 400 ఎకరాలకు నీరు వెళ్లడం లేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్ల గెడ్డ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు ఎల్.ఆదినారాయణ, అర్.సత్యం, టి.పైడిపినాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు రైతులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన కర్రోతు



సిఎం చంద్రబాబును సిఎం కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారి కలిసి శుభాకాంక్షలు చెప్పారు. నిరంతరం ప్రజలలోనే ఉండాలని బంగార్రాజుకు సిఎం చెప్పినట్లు సమాచారం.

ప్రజాశక్తి- భోగాపురం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - భోగాపురం

నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా లోకం మాధవి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక సంచికను విడుదల చేసింది. మండలంలోని ముంజేరు సచివాలయం వద్ద ఈ ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువలతో కూడుకొని ప్రజలకు మంచి సమాచారం అందించే పత్రికల్లో ప్రజాశక్తి ఒకటని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, ఎంపిడిఒ చంద్రకళ, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ బూర్లె శ్రీధర్, వ్యవసాయాధికారి హరికృష్ణ, ఉద్యానవన శాఖ అధికారిని జోత్స్న, నాయకులు రమణ, పళ్ళ రాంబాబు, పల్లంట్ల జగదీష్, కోల రామసూరి, చిన రాములు, బడే నాయుడు పాల్గొన్నారు.

రాజులు చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక రాజులు చెరువు ఆక్రమణలపై సోమవారం ఆయకట్టు రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వేనెంబరు 462పై ఆధారపడి సుమారు 200 ఎకరాల భూమిని పండించుకుంటున్నామని, గత కొంతకాలంగా ఆక్రమణదారులు ఈ చెరువు పై కన్నేసారని, పదే పదే దురాక్రమణకు పూనుకుంటున్నారని, వ్యవసాయపనులు మానుకొని వారిని నిలువరించడంలో విఫల ప్రయత్నాలు చేయవలసివస్తుందని జిల్లా కలెక్టర్ వద్ద రైతులు తమ గోడును వినిపించారు. గత నెలలో తహశీల్దార్‌కి ఫిర్యాదు చేసామని, ఈ నెల 21వ తేదీన విఆర్‌ఒ, ఆర్.ఐ, కార్యదర్శి దండోరా ద్వారా సర్వే గురించి చాటింపు వేయగా హాజరయ్యామని, అయితే సర్వే ప్రతి అడుగుగా చలానా చెల్లించిన వారికే ఇస్తామని బదులిచ్చారని, సర్వే కొలతలపై అభ్యంతరాలు, సందేహాలున్నాయని చెప్పారు. ఎఫ్‌ఎమ్‌బి దస్త్రాల ప్రకారం కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. తప్పుడు నెంబర్లు సృష్టించి దురాక్రమణకు పాల్పడడాన్ని నియంత్రించాలని కోరారు. శిధిలావస్థ మదుములను పునర్నిర్మించాలని కోరారు. వినతిని స్వీకరించిన కలెక్టర్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారని రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగినేని సూరిబాబు, మోపాడ కృష్ణ, పొట్నూరు రమణ, కొటాన రాము, దామోదర అప్పారావు, దామోదర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లాకౌట్ పేరుతో నెట్టివేయడం సరికాదు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను లాకౌట్ పేరుతో బయటకు నెట్టడం సరైన పద్ధతి కాదని, భేషరతుగా లాకౌట్ ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని కంపెనీ కెసిసి నాయకులు కోరారు. జిందాల్ కార్మికులు చేస్తున్న పోరాటం సోమవారం నాటికి 39 రోజులకు చేరింది. జిందాల్ పరిశ్రమ కార్మికులతో 40 సంవత్సరాలుగా పని చేయించుకుని, ఇప్పుడు కార్మికులను ఒరిస్సా రాష్ట్రం జాజ్‌పూర్ వెళ్లవలసిందేనని తెగేసి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు అమాయకులు కాదని, సహనం, ఓర్పుతో వేచి చూస్తున్నారని యాజమాన్యం స్పందించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిందాల్ కెసిసి నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, గాడి అప్పారావు నాయకత్వంలో కార్మికులు నాల్గవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో లగుడు అప్పలనాయుడు, జి. రాము, గొర్లె సుందర్రావు, పిల్లల గంగులు, అంగి దాలినాయుడు, అక్కిరెడ్డి సన్యాసిరావు, పోకల రాము, గండి దేముడు, దేగల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - బాడంగి

మండలంలోని పినపెంకి పంచాయతీ గడబవలస గ్రామానికి చెందిన గిరిజన ప్రజలు, సిపిఎం నాయకులు తమ గ్రామంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామానికి ఉన్న శ్మశాన వాటిక నది తీవ్రత వల్ల కొట్టుకుపోయిందని దీంతో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. గ్రామానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకొని మొక్కలు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని, ఆ మొక్కలను తొలగించి ఆ ప్రభుత్వ భూమిని తమ గ్రామ శ్మశాన వాటికకు కేటాయించాలని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఖాతాదారులకు మెరుగైన సత్వర సేవలే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఆరికతోట ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు నూతన మేనేజర్ పెద్దింటి శ్రీనుబాబు తెలిపారు. సోమవారం బదిలీపై మక్కువ నుంచి వచ్చిన ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. గత మూడేళ్లుగా ఇక్కడ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఫీల్డ్ ఆఫీసర్ క్యాష్ ఇన్చార్జితోనే నడుస్తుంది. ఇక మేనేజర్ కూడా విధుల్లో చేరడంతో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకు వస్తామని అన్ని రకాల రుణాలు త్వరితగతిన మంజూరు చేస్తానని, రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించాలని మేనేజర్ కోరారు. సిబ్బంది నూతన మేనేజర్ శ్రీను బాబుకు ఘన స్వాగతం పలికారు.

బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్‌లో శిక్షణ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సపోర్ట్ సిబ్బంది తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ ప్రొఫెసర్ మురళీ, డాక్టర్ సుబ్రత్ కుమార్ పరిదా, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ పలువురు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండల విద్యాశాఖాధికారి జి.జగదీశ్వరరావు సోంపురం, ముకుందపురం ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించి పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, ఇయర్ ప్లాన్, లెసన్ ప్లాన్, స్కూల్ టైం టేబుల్, క్లాస్ టైం టేబుల్, పాఠశాల మౌలిక సదుపాయంలో టాయిలెట్స్, పాఠశాల గార్డెన్, విద్యార్థుల ప్రగతి, స్మార్ట్ టీవీ టైం టేబుల్ పరిశీలించారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కొండ గుంపాంలో కిరాణా దుకాణం దగ్ధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాంలో కిరాణా దుకాణం దగ్ధమైంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కలిశెట్టి పైడమ్మ కిరాణా కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తోంది. ఈ నేపధ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి కిరాణా కొట్టు దగ్ధం చేశారని ఆరోపిస్తున్నారు. కాలిపోయిన కిరాణా కొట్టు, సామాన్లు కలుపుకొని సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. కాగా బాధితురాలి కుమారుడు కలిశెట్టి సత్యనారాయణ కిరాణా కొట్టు దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గంట్యాడ

మండలంలోని వసాది గ్రామంలో సోమవారం మధ్యాహ్నం పిడుగు పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. బోడసి ఎర్రయ్యదు (47) పొలంలో దొంకలు కొడుతుండగా పిడుగు తనపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య సూర్యమ్మ ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నోటీసులంటే లెక్క లేదా?

- పట్టించుకోని ఆక్రమణ దారులు
- కాలువపై కట్టడాలు
- ఆర్‌డిఒకు ఫిర్యాదు చేసిన రైతులు

ప్రజాశక్తి - తెర్లాం

మండల కేంద్రంలోని దాసర బంద చెరువుకు వెళ్లే ప్రధాన కాలువైన మంగళగెడ్డ కాలువ ఆక్రమణకు గురైంది. ఆక్రమణలను గుర్తించిన అధికారులు అక్రమదారులకు నోటీసులిచ్చినా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా కట్టడాలను చేపడుతున్నారు. గ్రామానికి చెందిన చింతల వెంకటరమణ కాలువపై నిర్మాణం చేశారని అధికారులు నోటిసులిచ్చినా ఆయన లెక్కచేయకుండా కట్టడాలను కొనసాగిస్తున్నారు. ఆదివారం రాత్రి కట్టడాలపై దర్జాగా స్లాబు వేసి నిర్మాణాలను మరింత వేగవంతం చేశారు. సోమవారం తెల్లవారు చూసిన రైతులు పంచాయతీ ఇఒ సూరిబాబుకు ఫిర్యాదు చేశారు.

విచారణకు ఇరిగేషన్ ఎఇ

దాసర బంద కాలువ ఆక్రమణపై రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఎఇ హరి సోమవారం పరిశీలించారు. అందులో భాగంగా దాసరి బంద కింద ఉన్న ఆయికట్టుదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఇఒ సూరిబాబును కూడా వివరాల అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చామని అయినా వాటిని భేఖాతరు చేసి నిర్మాణాన్ని కొనసాగించారని ఇఒ ఎఇకు తెలిపారు. పరిశీలన తరువాత తక్షణమే చర్యలు తీసుకుంటామని ఎఇ తెలిపారు. కాగా గ్రామ సర్పంచ్ బి. రూప, ఎంపిటిసి జి. ఆనందరావు అధికారులతో కలిసి కట్టడాల వద్దకు వెళ్లి వీటికి పంచాయతీ అనుమతులు లేవు కదా అని సదరు అక్రమదారుడుని ప్రశ్నించారు. దీనికి మీకు నచ్చింది చేసుకోండి అంటూ సదరు అక్రమదారుడు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఈ ఆక్రమణలపై ఎఇ రైతులు, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ కార్యాలయం వద్ద మరింత లోతుగా ఆరా తీశారు. వెంటనే ఆక్రమణల విషయాన్ని పై అధికారులకు నివేధించి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, నర్సుపల్లి వెంకటేశ్వరరావు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎఇను కోరారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాలువ ఆక్రమణపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

మండల కేంద్రంలో ఉన్న దాసరి బంద చెరువు నుంచి సాగునీటిని సరఫరా చేస్తున్న కాలువ అక్రమ కట్టడాలతో కుచించిపోయింది. ఈ అక్రమ కట్టడాలు నిరోధించాలని గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు బోను అప్పలనాయుడు, మెండు రాము, బోన్ సురేష్, రాము తహశీల్దార్, బొబ్బిలి ఆర్‌డిఒకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కాలువపై గత కొంతకాలంగా ఎవరికి నచ్చినట్లు వారు కానాలు కడుతున్నారని గ్రామానికి చెందిన చింతల వెంకటేష్, అంట్లవర గ్రామానికి చెందిన కోట అప్పలనాయుడు ఇద్దరూ గత వారం రోజులుగా కాలువ బట్టీ సగానికి పైన ఆక్రమించుకొని పెద్ద పెద్ద రాతి కట్టడాలు చేపడుతున్నారన్నారు. దీని వల్ల చెరువుకు నీరు సరిగా రాదని పంటలకు నష్టం కలుగుతుందని, అక్రమ కట్టడాలు తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ ఇఒ పి.సూరిబాబును వివరణ అడగగా నోటీసులు ఇచ్చినా సంబంధిత అక్రమార్కులు పట్టించుకోవడం లేదని పైగా ఏం చేసుకుంటారో చేసుకోండి అని అంటున్నారని ఈ విషయాన్ని తహశీల్దార్‌కు చెప్పానని తెలిపారు.

రైల్వే బ్రిడ్జి పనులు పరిశీలించిన 'కళా'

ప్రజాశక్తి-చీపురుపల్లి

అర్థాంతరంగా నిలిచిపోయిన చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోమవారం పరిశీలించారు. చీపురుపల్లి రైల్వే బ్రిడ్జి పనులు గత కొంత కాలంగా స్థానిక సమస్యల వల్ల నిలిచిపోయాయి. దీని కారణంగా చీపురుపల్లి నుండి రాజాం, పాలకొండ ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బ్రిడ్జి పనులు నిలిచి పోవడానికి గల కారణాలను అధికారులతో ప్రత్యక్షంగా చర్చించేందుకు కళావెంకటరావు సోమవారం బ్రిడ్జి వద్దకు చేరుకొన్నారు. జి అగ్రహారం నుంచి చీపురుపల్లి కరూర్ వైశ్యాబ్యాంకు వరకు అధికారులతో కలసి పరిశీలించారు. బ్రిడ్జి పనులకు ఆటంకం కలగకుండా, స్థానిక వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వ్యాపారస్తులు కూడా బ్రిడ్జి పనులకు ఆటంకం కలగకుండా సర్దుకుపోవాలని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఆయన మాట్లాడారు. బ్రిడ్జి పనులను పరిశీలించాం. కరూర్ వైశ్యా బ్యాంకు నుంచి రిక్షా కాలనీకు వెళ్లేందుకు బ్రిడ్జి పక్క నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పోలీసు స్టేషన్ వైపు ఉన్న బడ్డీలన్నీ పేదలకు సంబంధించినవి కాబట్టి వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా నిబంధనల ప్రకారం వంతెన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. వెదుళ్లవలస వెళ్లే రోడ్డులో కూడా బ్రిడ్జి పక్క నుంచి మరో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జి పనులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తయితే ఒరిస్సా వరకూ రవాణాకు వెసులుబాటు ఉంటుందని చెప్పారు. చీపురపల్లి గ్రామీణాభివృద్ధిపై త్వరలో సమీక్ష చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, చీపురుపల్లి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, ఆర్ఇసిఎస్ మాజీ ఛైర్మన్ దన్నాన రామచంద్రుడు, గరివిడి మండల పార్టీ అధ్యక్షుడు సారిపాక సురేష్, పైల బలరాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు ముల్లు రమణతో పాటు పలువురు టిడిపి నాయకులు, జనసేన నాయకులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి- బొండపల్లి

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని బొండపల్లి ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ హై స్కూల్‌లో సోమవారం మత్తు పదార్థాలు వల్ల జరిగే అనర్థాలు, ఫోక్సో చట్టం పై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాక్షించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచి క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడరాదని, సరదాగా చేసిన గంజాయి పీల్చే అలవాటు తమ జీవితాలను నాశనం చేస్తుందనే వివరించారు. పాఠశాలలో అమ్మాయిలను ర్యాగింగ్ చేయడం వంటి దుర అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వంగర: విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ

వంగర: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్క్మ్ వైవి జనార్ధన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు యువత బానిసలయితే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె నారాయణ రావు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బేబినాయన పుట్టిరోజు వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రక్తదాతలే ప్రాణదాతలు అని మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. ఎమ్మెల్యే బేబినాయన జన్మదిన వేడుకలు సందర్భంగా సోమవారం కోటలో రోటరీ క్లబ్, అవేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని తెంటు రాజా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరతతో అనేకమంది గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్త నిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు జేసీ రాజు, అవేర్ ఫౌండేషన్ అధ్యక్షులు మనోజ్, టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు సాయిరమేష్ మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మ ఇస్తాడన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, రోటరీ, అవేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబినాయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఎం.బూర్జవలస, పెంట గ్రామాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. బేబినాయన జన్మదినం సందర్భంగా పేదలకు వస్త్రాలను పంచి అన్నదానం చేశారు.



రామభద్రపురం: ఆరికతోటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

బాడంగి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పుట్టినరోజు వేడుకలు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఇంటి దగ్గర తెంటు రవిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహిం చారు. నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. ఎరుకులపాకల గ్రామంలో సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ప్రాథమిక పాఠశల విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు, వికలాంగులు, వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి గ్రామానికి చెందిన కొరగంజి అభిలాష్ (అభిలాష్ ట్రేడ్స్) ఆధ్వర్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహన కార్యదర్శి బాబు పాలూరు, పెరుమాలి గ్రామం టిడిపి నాయ కులు సాగిరాజు అప్పల నరసింహరాజు, సాగిరాజు జగన్నా ధరాజు, జగ్గరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండల పార్టీ అధ్యక్షులు మరడాన రవి, కొరగంజి శ్రీనివాసరావు, ధనంజయరావు, రవణమూర్తి పాల్గొన్నారు.



బొబ్బిలి: రక్తదానం చేస్తున్న యువత

రామభద్రపురం: బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన జన్మదిన వేడుకల్లో భాగంగా ఆరికతోటలో టిడిపి నాయకులు పల్లా చంద్రరావు ఆధ్వర్యంలో బోసు, ప్రసాద్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనిశెట్టి భాస్కరరావు, బేత స్వామినాయుడు, రెడ్డి అప్పలరాం, యజ్జల కన్నయ్య, అడపా అప్పలకొండ, మూడడ్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనజాక్షి

టిడిపి చేతల ప్రభుత్వం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గత ప్రభుత్వంలా మాటల ప్రభుత్వం కాదని టిడిపి చేతల ప్రభుత్వమని టిడిపి మహిళా పార్లమెంటు అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. సోమవారం ఆమె మహిళా కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో బహిర్భూమికి వెళ్లిన సుచరిత అనే మహిళపై అత్యాచారం, హత్య చేయడం దారుణమన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగల పూడి అనిత ప్రమాణ స్వీకారం చేసి 36గంటల్లో దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి సిఎం చంద్ర బాబు తక్షణమే స్పందించి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం మహిళలకి అండగా ఉంటుందని ఈ సంఘటన ఉదాహరణగా చెప్పుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

సాగునీటికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

రైతులను ఆదుకునేందుకు సాగునీటికి ప్రాధాన్యత ఇస్తానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. మండలంలోని ముంజేరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలను ఆమె చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాగునీరు లేకపోవడం వల్ల రైతులు వ్యవసాయం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్న బోర్లలో నీరు సక్రమంగా రాక పంటలు వేయడం లేదని తెలిపారు. అందుకే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయానికి ఉపాధి కూలీలను అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు చేసినట్లు ఉంటుందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖ ఏడి నాగభూషణం మాట్లాడుతూ విత్తనాలను ప్రభుత్వం సకాలంలో అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు మాట్లాడుతూ భూములు ఆన్లైన్ చేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్య చాలా ఎక్కువగా మన నియోజకవర్గంలో ఉందని దీనిపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకళ, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ బూర్లె శ్రీధర్, వ్యవసాయాధికారి హరికృష్ణ, ఉద్యానవన శాఖ అధికారిని జోత్స్న, నాయకులు రమణ, పళ్ళ రాంబాబు, పల్లంట్ల జగదీష్, కోల రామసూరి, చిన రాములు, బడే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

డెంకాడ: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన వరి ఇతర విత్తనాలను ఆర్‌బికెల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక ఆర్‌బికె వద్ద సోమవారం ఆమె రైతులకు రాయితీపై విత్తనాలను సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కోసం రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులూ తమ వద్దకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం, టిడిపి నాయకులు కంది చంద్రశేఖర్, బిజెపి ఇంచార్జి బూర్లి శ్రీధర్, పల్లె భాస్కర్ రావు, కలిదిండి పాణిరాజు, కంది సూర్యనారాయణ, బంటుపల్లి రామునాయుడు, పతివాడ శివరామ విద్యసాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణరెడ్డి, తుమ్మి లక్ష్మీరాజ్, కొయనేని రమణ, డెంకాడ సర్పంచ్ పతివాడ గౌరి, ఎంపిటిసి కోరాడ కుమారి, చలుమూరి మహేష్, జనసేన కో-ఆర్డినేటర్ పైల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: లక్కవరపుకోట మండల కేంద్రంలోని అగ్రికల్చర్ ఆఫీస్ దగ్గిర రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ కాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు రాయితి పై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులందరు కూడా అలసత్వం వహించకుండా ఎస్.కోట నియోజక రైతులందరికీ సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.కోట మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు చుక్కల మల్లు నాయుడు, ప్రధాన కార్యదర్శి కొట్యాడ ఈశ్వరరావు, మాజీ ఎంపిటిసి మళ్ల రామకృష్ణ, తలారి సర్పంచ్ ప్రసాద్, ఖాశాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, ఎల్.కోట మండల తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాద్ రాజేష్ సచివాలయ సిబ్బంది, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: రాయితీపై విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ జి.రామారావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిఆర్, గ్రామీణ నీటి సరఫరా పథకం అధికార్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుధ్యానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగు నీటి సరఫరాలో ఇబ్బందులుంటే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నాయి కాబట్టి ఎప్పటికప్పుడు మురుగు నీరు నిల్వ కాకుండా పూడికలు తొలగించి పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కె. సింహాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ నిశ్చల

వేపాడ: సీజనల్ వ్యాధులపై స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం 29 పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ పారిశుద్య పనులు, ఎస్‌డబ్ల్యుపిసి నిర్వహణ సక్రమంగా చేయడం శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ నిశ్చల మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ ఆవరణలో పరిశుభ్రత పాటిస్తూ వానపాములు ద్వారా ఎరువుల తయారీకి చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజ్‌లలో పైప్ లైన్స్ వున్నట్లుయితే వాటర్ లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. బోర్ బావులు, దగ్గర నీరు నిల్వ లేకుండా బాధ్యత వహించాలన్నారు. 29 గ్రామ పంచాయతీలలో పిహెచ్ మెటీరియల్ స్టాక్ ఉంచాలన్నారు. డెంగీ, మలేరియా వంటివి పంచాయతీలలో వస్తే ఆ బాధ్యత కార్యదర్శిదేనన్నారు. పంచాయతీలలో పారిశుధ్య పనులు ఎప్పటిపకప్పుడు జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. ఇఒపిఆర్‌డి ఉమా, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, బొద్దాం, వేపాడ పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ శివాని, డాక్టర్ ధరణి, సిహెచ్ఒ ఆంజనేయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.